నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

హైదరాబాద్, మంగళవారం 20 మే 2025 | RANGAREDDY




శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో 90 రోజుల పాటు నిర్వహించిన డేటా ఇంజినీరింగ్ నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. నాలెడ్జ్ సిటీలోని టీ-హబ్‌లో జరిగిన ముగింపు వేడుకలకు తెలంగాణ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సంజయ్ కుమార్, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) సీఈవో శ్రీకాంత్ సిన్హా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శిక్షణ పూర్తి చేసుకున్న 80 మంది నిరుపేద గ్రాడ్యుయేట్లకు ధ్రువీకరణపత్రాలు, 22 మంది విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. - కొండాపూర్, మే 19

# లక్ష్యానికి దూరంగా..

- జిల్లాలో నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు
- 2.50 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేసిన అధికారులు
- ఇప్పటివరకు 10 వేల మెట్రిక్ టన్నులు దాటని కొనుగోళ్లు
- కొనుగోలు కేంద్రాలను వేధిస్తున్న గన్నీ బ్యాగులు, హమాలీల కొరత
- కొనుగోళ్ల ఆలస్యంతో తడిసి ముద్దవుతున్న ధాన్యం
- హమాలీలుంటేనే ధాన్యం తూకం.. లేకుంటే రోజుల తరబడి నిరీక్షించాల్సిందే..

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు నత్తన డకన సాగుతున్నాయి. కొనుగోలు కేంద్రాల పనితీరుపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో హమాలీల కొరత వెంటాడుతున్నది. మరోవైపు రైతులకు సరిపడా గన్నీ బ్యాగులూ అందుబాటులో లేకపోవడంతో కొనుగోలు కేంద్రాల పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. జిల్లాలో ఈ యాసంగిలో 2,50,000 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేసిన అధికారులు.. అందుకునుగుణంగా ఏర్పాట్లు చేయలేదు. కేవలం 40 కొనుగోలు కేంద్రాలను మాత్రమే ఏర్పాటు చేశారు. అందులో ఏడు డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఉండగా.. మిగతావి ఐకేపీ, సహకార సంఘాల ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. దిగుబడి అధికంగా రావడంతో అన్నదాతలు పెద్దఎత్తున కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకొస్తున్నారు. తీసుకొచ్చిన వడ్లను ఎప్పటికప్పుడు తూకం వేయకుండా అక్కడి సిబ్బంది నిర్లక్ష్యం చేయడంతోపాటు.. పలు కొర్రీలతో రైతన్నల సహనానికి పరీక్ష పెడుతున్నారు. హమాలీలు, గన్నీ బ్యాగుల కొరతతో అన్నదాతలు రోజుల తరబడిగా అక్కడే నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొన్నది. అంతేకాకుండా కొనుగోలు కేంద్రాల పరిధిలో కుప్పలుగా పోసిన ధాన్యం రాశులు అకాల వర్షాలతో తడిసి.. ముద్దవుతున్నాయి. దీంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. మద్దతు ధర వస్తుందని.. పంటల సాగుకు తీసుకొచ్చిన అప్పలను చెల్లించవచ్చనే ఉద్దేశంతో కొనుగోలు కేంద్రాలకు వడ్లను తీసుకొస్తే.. సక్రమంగా కొనుగోళ్లు చేయకపోవడంతో అకాల వర్షాలకు తడిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కొనుగోళ్లు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- రంగారెడ్డి, మే 19 (నమస్తే తెలంగాణ)



హమాలీలు లేక కొనుగోలు కేంద్రం వద్ద నిలిచిపోయిన ధాన్యం బస్తాలు



కొనుగోళ్లు లేక ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద నిరీక్షిస్తున్న రైతులు

జిల్లాలో ఈ యాసంగిలో ధాన్యం దిగుబడి అధికంగా వస్తుందని తెలిసినా అధికారులు సరిపడా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత వర్షాకాలంలో కొనుగోలు చేసిన వడ్లను దృష్టిలో ఉంచుకుని.. ఈ యాసంగిలోనూ తక్కువ వడ్లే వస్తాయని.. కేవలం 40 మాత్రమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కానీ, జిల్లా నుంచి 2,00,000లకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. దీంతో అన్నదాతలు బయటి మార్కెట్ కంటే కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయిస్తే ఎక్కువ ధర వస్తుందని.. ఇక్కడికి తీసుకొస్తున్నారని పేర్కొంటున్నారు. కేంద్రాలకు అంచనాలకు మించి ధాన్యం వస్తుండడంతో కొన్ని చోట్ల అధికారులు చేతులెత్తేసారు. జిల్లాలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏడు కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటివరకు 90,000 మంది రైతుల నుంచి కేవలం 3000 క్వింటాళ్ల వరకే కొన్నారు. అలాగే, ఐకేపీ, సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనూ కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. ఈ కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 10,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కూడా సేకరించలేదు. దీంతో అధికారులు అంచనా వేసిన లక్ష్యాన్ని చేరుకునే అవకాశం కనిపించడంలేదు.

### వేధిస్తున్న గన్నీ బ్యాగులు, హమాలీల కొరత

కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారు. అంతేకాకుండా ధాన్యంలో తేమ శాతం ఉన్నదని.. తాలు ఉందని ఇలా పలు రకాల కారణాలు చెబుతూ అన్నదాతలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఆరబెట్టిన ధాన్యాన్ని సంచుల్లో నింపేందుకు సరిపడా గన్నీ బ్యాగులు ఉండడంలేదు. ఇరుగుపొరుగు వారిని అడిగి సంచులను సమకూర్చుకుని ధాన్యాన్ని సంచుల్లో నింపి వాహనాల్లో కేంద్రాలకు తీసుకెళ్తే అక్కడ హమాలీల కొరతతో వాటిని కేంద్రాల్లోకి రానివ్వడంలేదు. హమాలీలు దొరికిన తర్వాతే వడ్లను తూకం వేస్తున్నారు. లేకుంటే రోజుల తరబడిగా అక్కడ నిరీక్షించాల్సిందే. దీంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అకాల వర్షాలకు పంట తడిసిపోతే.. మొదటికే మోసం వస్తుందనే ఉద్దేశంతో.. తక్కువ ధరకే వ్యాపారులు, దళారులకు విక్రయించి అన్నదాత నష్టపోతున్నాడు. ఇలా పలు రకాల కారణాలతో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అన్నదాత సహనానికి పరీక్ష పెడుతున్నారు.



సింగపూర్ వార్డులో బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

# నీటి కోసం నిరసన

- సింగపూర్ వార్డులో నీటి కటకట
- సరిపోని మిషన్ భగీరథ నీరు
- 20 రోజులైనా పనిచేయని బోరు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

చేవెళ్ల రూరల్, మే 19 : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్ని వర్గాల ప్రజలు సమస్యలతో సహవాసం చేస్తున్నారు. మౌలిక వసతులు సమకూరక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. శంకర్‌పల్లి మున్సిపల్ పరిధి సింగపూర్ వార్డులో గత రెండు నెలలుగా మిషన్ భగీరథ నీరు ఏడు బిందెల లోపే వస్తున్నదని.. ఉన్న బోరు పని చేయక 20 రోజులు దాటుతుండడంతో మహిళలు తాగునీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో.. ఆగ్రహం చెందిన మహిళలు సోమవారం వార్డులోని ప్రధాన రోడ్డులో ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు.

### నీటి సరఫరాను పునరుద్ధరిస్తాం

**- యోగేశ్, శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్**

మిషన్ భగీరథ నీటి సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటు న్నాం. బోరు మోటర్‌ను రిపేర్ చేయించి సరఫరాను మెరుగుపరుస్తాం. నీటి ఎద్దడి నివారణకు వార్డుకు ట్యాంకర్లను పంపిస్తున్నాం.

### చాలా ఇబ్బందులు పడుతున్నాం



మిషన్ భగీరథ నీరు సరిపడా రాకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. బోరు ఉన్నా దాని నుంచి నీరు రావడంలేదు. సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఎవరూ పట్టించుకోవడంలేదు.

**- సిరంగారి లక్ష్మి, గృహిణి, సింగపూర్ వార్డు**



పార్టీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

# హామీలు నెరవేర్చని కాంగ్రెస్

**పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి**

పరిగి, మే 19 : ఎన్నికల సమయంలో 420 హామీలిచ్చిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చి 16 నెలలైనా ఒక్క హామీనీ సంపూర్ణంగా అమలు చేయలేదని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి విమర్శించారు. సోమవారం పరిగిలో కులకచర్ల మండలం పీరంపల్లికి చెందిన 20 మంది కాంగ్రెస్ కార్యకర్తలు మహేశ్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారందరికీ ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అధికారంలోకి రావాలనే ఏకైక ఆలోచనతో కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీల పేరిట అలవికాని హామీలిచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి 16 నెలలైనా ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు చేయకుండా, కేవలం డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నదని విమర్శించారు. కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసుగెత్తిపోయారని, ప్రజల్లో వ్యతిరేకత తీవ్రంగా పెరిగిందన్నారు. అందులో భాగంగానే కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని చెప్పారు. ప్రతిపక్ష పార్టీగా ప్రజల సమస్యల పరిష్కారం కోసం ముందుండి పోరాడతామని తెలిపారు. కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ప్రతి కుటుంబానికి మేలు చేకూరిందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు రాజు, నాయకులు పాల్గొన్నారు.



కామునిచెరువులో పూర్తి స్థాయిలో తగ్గిన నీరు

# నాడు ఫుల్లు.. నేడు నిల్లు

- గత ప్రభుత్వ హయాంలో చెరువుల పునరుద్ధరణ
- మిషన్ కాకతీయతో చెరువుల్లో నీళ్లు నిల్వ
- చెరువులు ఎండిపోతున్నా పట్టించుకోని ప్రస్తుత ప్రభుత్వం
- కాంగ్రెస్ సర్కారుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

కులకచర్ల, మే 19 : చెరువుల పునరుద్ధరణలో భాగంగా గతంలో బీఆర్ఎస్ సర్కారు మిషన్ కాకతీయ ద్వారా చర్యలు తీసుకోవడంతో చెరువుల్లో నీళ్లు నిల్వ ఉండేవి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత తాము గోస పడుతున్నామని రైతులు పేర్కొంటున్నారు. కులకచర్ల మండలంలో ముజాహిద్‌పూర్ అక్కమ్మ చెరువు, కాముని పల్లి కాముని చెరువు, అంతారం పాటిమీది చెరువు, కులకచర్ల మైలమ్మ చెరువు, ఇప్పాయిపల్లి చెరువు, వీటితోపాటు చాలా చెరువులు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పునరుద్ధరించబడ్డాయి. కాని అవే చెరువులను ప్రస్తుత సర్కారు పట్టించుకోకపోవడంతో నిండుకుండలా ఉన్న చెరువులు ఒట్టిపోతున్నాయి. గతంలో చెరువుల కింద మూడు పంటలు పండిస్తే నేడు రెండు పంటలు కూడా పండించలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాముని చెరువు కింద సుమారు 500 ఎకరాల సాగు గతంలో జరుగగా.. ఈ సంవత్సరం కనీసం 200 ఎకరాలూ సాగు చేయలేక పోయారు. గతంలో కులకచర్లలో ఉన్న మైలమ్మ చెరువు కింద 700 ఎకరాల వరకు సాగు చేయగా.. నేడు 300 ఎకరాలు., ముజాహిద్‌పూర్ అక్కమ్మ చెరువు కింద 800 ఎకరాలు సాగు చేయాల్సి ఉండగా కనీసం 300 ఎకరాలు కూడా సాగు చేయలేకపోయారు.



పూర్తిగా ఎండిపోయిన ఘనాపూర్ చెరువు

### బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే చెరువుల పునరుద్ధరణ



బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న సమయంలోనే చెరువుల పునరుద్ధరణ జరిగింది. మిషన్ కాకతీయ ద్వారా చెరువుల్లో పూడికతీతతోపాటు కట్టలు, తూముల మరమ్మతులు చేసి చెరువుల్లో నీళ్లు పూర్తిస్థాయిలో నిలిచేలా ఉండేది. రైతులు ప్రతి సంవత్సరం మూడు పంటలు సాగు చేసేవారు. కాని నేడు చెరువుల్లో నీళ్లు పూర్తి స్థాయిలో ఎండిపోవడంతో పంటలు సాగు చేసే పరిస్థితులు లేవు.

**- పాల మహిపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్, కామునిపల్లి, కులకచర్ల మండలం**

### రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



ప్రస్తుత ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి. చెరువుల కింద వేసిన పంటలు పూర్తిస్థాయిలో నీళ్లు సరిపోక ఎండిపోయాయి. దీంతో రైతులకు పెట్టుబడి కూడా రాక చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం రైతులకు న్యాయం చేయాలి. గతంలో రైతుల పట్ల శ్రద్ధ ఉండేది.. అదే శ్రద్ధ ఈ ప్రభుత్వం కూడా చూపించాలి. రైతులు సంతోషంగా ఉంటేనే దేశం, రాష్ట్రం, ప్రజలు సంతోషంగా ఉంటారు. ఈ విషయాన్ని ప్రభుత్వం అర్థం చేసుకోవాలి.

**- మఠం రాజశేఖర్, మందిపల్, చౌడాపూర్ మండలం**

- యాచారంలో డబుల్ రోడ్ల నిర్మాణానికి గ్రహణం
- గతంలోనే రోడ్ల అభివృద్ధికి రూ.77 కోట్లు మంజూరు
- యాచారం-మీర్‌ఖాన్‌పేట రోడ్డుకు రూ.48 కోట్లు
- నందివనపర్తి-గ్రీన్ ఫార్మా సిటీ రోడ్డుకు రూ.29 కోట్లు
- అర్ధాంతరంగా నిలిచిన డబుల్ రోడ్ల నిర్మాణ పనులు
- నిర్మాణ దశలో ఆగిన రోడ్లతో ప్రజల అవస్థలు
- సకాలంలో బిల్లులు రాక పనులు నిలిపేసిన కాంట్రాక్టర్
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



నిర్మాణ దశలోనే నిలిచిపోయిన యాచారం-మీర్‌ఖాన్‌పేట డబుల్ రోడ్డు

# డబుల్ ట్రబుల్

యాచారం, మే 19 : మండలంలోని గ్రామీణ ప్రాంత రోడ్లను అభివృద్ధి చేసేందుకు గత ప్రభుత్వం పెద్దపీట వేసిన విషయం తెలిసిందే. పట్టణ రోడ్లను తలపించేలా గ్రామీణ రోడ్లు, లింకురోడ్ల అభివృద్ధికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గ్రామీణ ప్రాంతాల రోడ్లు మీర్‌ఖాన్‌పేట నుంచి యాచారం వరకు నాలుగు లేన్ల రోడ్డుకు రూ.48 కోట్లు, నందివనపర్తి నుంచి మేడిపల్లి వరకు 100 ఫీట్ల రోడ్డుకు రూ.29 కోట్ల నిధులను గత కేసీఆర్ సర్కారు మంజూరు చేసింది. ఇందులో భాగంగా అటు కందుకూరు నుంచి ఇటు యాచారం వరకు శ్రీశైలం నాగార్జున సాగర్ ప్రధాన రహదారులను కలిపేందుకు నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. నందివనపర్తి నుంచి మేడిపల్లి వరకు ఫార్మాసిటీకి వెళ్లేందుకు 100 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనులు చేపట్టింది. 14కిలోమీటర్ల మేర రెండు రోడ్ల నిర్మాణానికి ఏకంగా రూ.77 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఇందులో కందుకూరు నుంచి మీర్‌ఖాన్ పేట వరకు డబుల్ రోడ్డు నిర్మాణం గత బీఆర్ఎస్ హయాంలోనే పూర్తయింది. ఔటర్ రింగ్‌రోడ్డును తలపించేలా రోడ్డు నిర్మాణం పూర్తయినప్పటికీ మీర్‌ఖాన్ పేట నుంచి యాచారం వరకు నిర్మించే రోడ్డు నిర్మాణ పనులు మాత్రం ముందుకు సాగడంలేదు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో రోడ్డు గత కొన్ని నెలలుగా నిర్మాణ దశలోనే నిలిచిపోయింది. అటు నందివనపర్తి-మేడిపల్లి రోడ్డు నిర్మాణం బ్రిడ్జిల నిర్మాణానికే పరిమితమైంది. ఈ రోడ్లకు మోక్షమెప్పుడో వేచి చూడాల్సిందే మరీ.

### బ్రిడ్జి నిర్మాణాలకే పరిమితమైన నందివనపర్తి-మేడిపల్లి రోడ్డు

నందివనపర్తి నుంచి మేడిపల్లి మీదుగా హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ వరకు రూ.29 కోట్లతో 100 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం ఉన్న సింగిల్ రోడ్డును 100 ఫీట్ల రోడ్డుగా విస్తరించేందుకు సంకల్పించింది. రోడ్డు వెడల్పు పనులను సైతం ప్రారంభించారు. రోడ్డు మార్గంలో ఉన్న రెండు చిన్న కల్వర్టులను పెద్ద బ్రిడ్జిలుగా నిర్మించి వదిలేశారు. ఈ రోడ్డు సైతం బ్రిడ్జిల నిర్మాణానికే పరిమితమైంది. రోడ్డు నిర్మాణం సైతం అర్ధాంతరంగా నిలిచిపోవడంతో బ్రిడ్జిల వద్ద ప్రయాణికులు వాహనదారులు నిత్యం నానా అవస్థలు పడుతున్నారు. ఎదురుగా వస్తున్న వాహనం కనిపించకపోవడం, వర్షం కురిస్తే ఏర్పడిన గుంతల్లో నీరు నిలిచి చిన్న కుంటలను తలపించడంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తే నందివనపర్తి, మేడిపల్లి, బొల్లిగుట్టతండా, కొమ్మోనిబావి, గంటోనిబావి గ్రామాలకు చెందిన ప్రజలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు. నందివనపర్తి-మేడిపల్లి లింకు రోడ్డుకు మోక్షమెప్పుడోనని ప్రయాణికులు ఎదురు చూస్తున్నారు. రోడ్డును త్వరితగతిన పూర్తిచేయాలని నందివనపర్తి, మేడిపల్లి గ్రామస్తులు కోరుతున్నారు.

### మీర్‌ఖాన్‌పేట-యాచారం రోడ్డుకు గ్రహణం

కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట మైసమ్మ గుడి నుంచి నజ్దిక్ సింగారం, నందివనపర్తి మీదుగా యాచారం వరకు ప్రస్తుతమున్న సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించేందుకు గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చొరవతో రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు సైతం మంజూరు చేసింది. రూ.48 కోట్ల నిధులతో చేపట్టిన మీర్‌ఖాన్‌పేట-యాచారం రోడ్డు పనులు మొదట్లో సాఫీగానే సాగాయి. రోడ్డు వెడల్పు పనులను వేగవంతం చేశారు. రోడ్డుకు ఇరువైపులా చెట్లు, రాళ్లు తొలగించారు. రోడ్డు చదును చేసి వెడల్పు చేశారు. ఇంతలో ప్రభుత్వం మారడంతో ఆ రోడ్డు పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. రోడ్డు వెడల్పులో భాగంగా ఉన్న బీటీ రోడ్డును తొలగించి చదును చేయడంతో మట్టి రోడ్డుగా మారింది. వర్షాలకు రోడ్డుపై మట్టి కొట్టుకుపోయి దుమ్ము లేస్తున్నది. దీంతో ఆ రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రయాణికులు దుమ్మూధూళితో నరకం చవిచూస్తున్నారు. వర్షానికి గుంతలలో నీరు నిలవడంతో వాహనదారులు జంకుతున్నారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనదారులూ అవస్థలు పడుతున్నారు. యాచారం నుంచి కందుకూరుకు త్వరగా చేరుకునే ప్రయాణికులు రోడ్డు అధ్వాన్నంగా ఉండటంతో గమ్యస్థానానికి సకాలంలో చేరుకోలేక పోతున్నట్లు వాపోతున్నారు. తరచుగా వాహనాలు అదుపుతప్పి కిందపడటంతో గాయాలపాలవుతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు. గత ఏడాదిన్నర కాలంగా ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులుపడుతున్నారు. ఈ రోడ్డుపై స్థానిక ఎమ్మెల్యే దృష్టి సారించి అర్ధాంతరంగా నిలిచిన పనులను వేగంగా పూర్తి చేసేలా కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

### పనుల నుంచి తప్పుకొన్న కాంట్రాక్టర్

రోడ్డు నిర్మాణానికి సకాలంలో బిల్లులు రాకపోవడంతో రోడ్డు నిర్మాణానికి టెండర్ వేసిన కాంట్రాక్టర్ పనుల నుంచి తప్పించుకున్నాడు. సుమారు రూ.20 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో పనుల నుంచి తప్పుకున్నట్లు తెలుస్తున్నది. వేరే కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టేందుకు ముందుకు రాకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పనులు నిర్మాణ దశలోనే నిలిచిపోయాయి. దీంతో ఈ పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయోనని ప్రజలు, వాహనదారులు వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరుతున్నారు.



బ్రిడ్జి నిర్మించి వదిలేసిన నందివనపర్తి-మేడిపల్లి రోడ్డు

### డబుల్ రోడ్డు పనులను పూర్తి చేయాలి



యాచారం నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు చేపట్టిన నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలి. గత కొన్ని నెలలుగా రోడ్డు విస్తరణ పనులు మధ్యలో నిలిచిపోవడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. దుమ్ము, దూళి, అడుగడుగునా గుంతలతో నిత్యం వాహనదారులు నరకం చూస్తున్నారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు ఈ రోడ్డుపై దృష్టి సారించాలి. గత ప్రభుత్వం గ్రామీణ రోడ్ల అభివృద్ధికి ఎంతగానో కృషి చేసింది. అదే అభివృద్ధి పథాన్ని కొనసాగిస్తూ నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనులను ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలి.

**- వర్త్యావత్ రాజునాయక్, మాజీ సర్పంచ్, నందివనపర్తి**

### నందివనపర్తి-మేడిపల్లి రోడ్డును నిర్మించాలి



నందివనపర్తి నుంచి మేడిపల్లి మీదుగా హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీకి 100 అడుగుల వెడల్పుతో నిర్మాణం చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలి. రోడ్డు నిర్మాణంలో భాగంగా ఇప్పటికి కేవలం రెండు బ్రిడ్జిలు మాత్రమే నిర్మించి వదిలేశారు. రోడ్డుకు గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ నిర్మాణంలోనే పనులు నిలిచిపోవడం గమనార్హం. ప్రభుత్వం గ్రామీణ రోడ్లపై దృష్టి సారించి మేడిపల్లి-నందివనపర్తి లింకు రోడ్డును పూర్తి స్థాయిలో నిర్మించేందుకు అన్ని విధాలుగా కృషి చేయాలి. లేదంటే ఆందోళన చేయాల్సి వస్తుంది.

**- పొద్దుటూరి రవీందర్‌గుప్తా, స్వచ్ఛంద కార్యకర్త, మేడిపల్లి**